ప్రజాశక్తి

గురువారం 1 ఫిబ్రవరి 2024

5

శ్రీకాకుళం

ఇవిఎం గోదాములు తనిఖీ

శ్రీకాకుళం : జిల్లా కేంద్రంలోని ఇవిఎం గోదాములను కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ బుధవారం తనిఖీ చేశారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు త్రైమాసిక తనిఖీల్లో భాగంగా ఇవిఎంలను భద్రపరిచిన గోదాములను గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల సమక్షంలో పరిశీలించారు. గోదాముల్లో భద్రతా చర్యలపై సమీక్షించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు, ఎన్నికల సెల్ సూపరింటెండెంట్ ప్రకాశరావు, పలు రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

చివరిసారైనా కరుణించేనా..?

- నేడు లోక్‌సభలో ఓటాన్ అకౌంట్ బడ్జెట్
- రైల్వే ప్రాజెక్టులు, కొత్త రైళ్లపై ప్రకటనపై ఎదురుచూపులు
- వేతనజీవులకు ఊరట లభించేనా?
- పెట్టుబడి సాయం పెంపుపై అన్నదాతల ఆశలు

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం లోక్‌సభలో ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌ను గురువారం ప్రవేశపెట్టనుంది. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టనున్న ఎన్నికల బడ్జెట్‌పై జిల్లా ప్రజలు గంపెడాశలతో ఉన్నారు. గతేడాది బడ్జెట్‌లో కేంద్ర ప్రభుత్వం పూర్తి రిక్తహస్తమే చూపింది. ఈసారైనా వెనుకబడిన జిల్లాకు ఏమేరకు ప్రాధాన్యం లభిస్తుందోనని జిల్లావాసులు ఎదురుచూస్తున్నారు. ఈ ఏడాది సార్వత్రిక ఎన్నికలకు ఈసారి ప్రజలకు వరాలు ప్రకటిస్తారా? లేక పన్నులు పెంచి సబ్సిడీలు కుదించి వాతలు పెడతారా అని జనం ఆశగా ఎదురుచూస్తున్నారు.నిత్యవసర వస్తువుల ధరలను తగ్గించే చర్యలు ఏమైనా ఉంటాయా అనే చర్చ జనంలో సాగుతోంది.ప్రధానంగా ఆదాయ పన్ను పరిమితి పెంపుపై వేతన జీవులు, మధ్య తరగతి ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. ఈ బడ్జెట్‌లోనైనా జిల్లాకు రైల్వే ప్రాజెక్టులు, రైల్వే స్టేషన్ల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ప్రకటించే వరాలు కోసం జిల్లా ప్రజలు ఆశలు పెట్టుకున్నారు.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

వ్యవసాయ రంగాన్ని ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో ప్రకటించే రాయితీలపై రైతాంగం ఎదురుచూస్తోంది. జిల్లాలో వరి, మొక్కజొన్న, పత్తి, మినప, పెసలు తదితర ప్రధాన పంటలను సాగు చేస్తున్నారు. వీటికి కేంద్ర ప్రభుత్వం 2023 ఖరీఫ్‌లో కంటితుడుపుగానే మద్దతు ధరలను ప్రకటించింది. విత్తనాలు, ఎరువులపై అందిస్తున్న సబ్సిడీలను కుదించింది. మరోవైపు పెరిగిన పెట్రోల్, డీజిల్ ధరలతో వ్యవసాయ ఖర్చులు తడిసిమోపెడవుతున్నాయి. వ్యవసాయ పరికరాలపై సబ్సిడీ, బ్యాంకుల నుంచి రుణాల పంపిణీ వంటిలో ఎటువంటి మార్పులు చోటు చేసుకోనున్నాయో అని అన్నదాతలు చర్చించుకుంటున్నారు. అధికారంలోకి వస్తే స్వామినాథన్ కమిషన్ అమలు చేస్తామని 2014లోనే బిజెపి ప్రభుత్వం ప్రకటించినా ఇప్పటి వరకు అమలు కాలేదు. మద్దతు ధరలకు గ్యారంటీ చట్టం చేయాలని రైతులు చాలా కాలం నుంచి డిమాండ్ చేస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం బడ్జెట్‌లో ఏం నిర్ణయం వెల్లడించనుందో అన్నదాతలు ఆశగా చూస్తున్నారు. చివరి ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లోనైనా ప్రభుత్వం ఏదైనా ప్రకటన చేస్తుందా అని ఎదురుచూస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం కిసాన్ సమ్మాన్ నిధి పేరుతో ఏడాది రూ.6 వేల సాయాన్ని మూడు విడతలుగా అందిస్తున్న విషయం తెలిసిందే. ఎన్నికల వరంగా రైతులకు కిసాన్ సమ్మాన్ నిధిని మొత్తాన్ని ప్రభుత్వం పెంచనుందనే వార్తలు వస్తున్న నేపథ్యంలో పెట్టుబడి సాయంపై రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారు.

రైళ్లు, రైల్వే ప్రాజెక్టులపై ఏం నిర్ణయాలో..?

శ్రీకాకుళం రోడ్డును మోడల్ స్టేషన్‌గా తీర్చిదిద్దనున్నట్లు గతంలో హామీనిచ్చినా అంతంతమాత్రంగానే అమలవుతోంది. ఇచ్ఛాపురం రైల్వేస్టేషన్‌ను మోడల్ రైల్వేస్టేషన్‌గా అభివృద్ధి చేస్తామని 2012-13 రైల్వే బడ్జెట్‌లో ఇచ్చిన హామీ నేటికీ నెరవేరలేదు. జిల్లాలోని జి.సిగడాం నుంచి రాజాం మీదుగా విజయనగరం జిల్లా బొబ్బిలిని కలుపుతూ గతంలో రూ.60 లక్షలతో సర్వే చేశారు. ఇప్పటివరకు దానికి అతీగతి లేదు. ఈ స్టేషన్ మీదుగా వెళ్తున్న యశ్వంత్‌పూర్ - హౌరా, పూరీ - అహ్మదాబాద్ రైళ్లు ఆగకుండా వెళ్లిపోతున్నాయి. జిల్లా కేంద్రమైన శ్రీకాకుళం రైల్వేస్టేషన్‌లో సుమారు 12కు పైగా ఎక్స్‌ప్రెస్‌లు ఆగకుండా వెళ్లిపోతున్నాయి. ప్రతి వారం ఐదారు వీక్లీ ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఈ స్టేషన్ మీదుగా ప్రయాణిస్తున్నా, హాల్టింగ్ లేదు. కాశీకి, షిర్డీకి నేరుగా ప్రత్యేక రైలు కావాలన్నది జిల్లా ప్రజలు చాలాకాలం నుంచి కోరుతున్నా, అదీ కలగానే మిగిలింది. రాజాం రైల్వే లైన్ హామీ చాలా ఏళ్లుగా పెండింగ్‌లో ఉంది. విశాఖ-హడ్డుబంగి ప్రాంతానికి కొత్త రైలు మార్గం వేయనున్నట్లు ప్రకటించినా, దానిలోనూ కదలిక లేదు. రైళ్లకు హాల్ట్‌లు, జిల్లా మీదుగా వెళ్లే కొత్త రైళ్లపై జనం ఆశలు పెట్టుకున్న ఆశలపై కేంద్ర ప్రభుత్వం నీళ్లు చల్లుతుందా?, నెరవేరుస్తుందా? అన్నది చూడాల్సి ఉంది.

బడ్జెట్‌పై వేతన జీవుల ఆశలు

వేతన జీవులకు ఎంత కాలంగా పన్నుల విషయంలో కావాల్సినంత ఊరట లభించడం లేదు. దీంతో ప్రస్తుత బడ్జెట్‌లో ఆదాయపు పన్ను విషయంలో కేంద్ర ప్రభుత్వ నిర్ణయంపై అంతా ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. పన్నుల విషయంలో గతేడాది బడ్జెట్‌లోనూ ఉద్యోగులకు నిరాశే మిగిలింది. ఆదాయపు పన్ను పరిమితిని రూ.ఐదు లక్షల నుంచి రూ.ఏడు లక్షలకు పెంచినట్టే పెంచిన కేంద్ర ప్రభుత్వం, వారికి కల్పిస్తున్న కొన్ని సౌకర్యాలపై కోత పెట్టింది. పాత విధానంలో ఉన్న హెచ్‌ఆర్‌ఎ, సిపిఎస్, 80సి, 80డి, ఇళ్ల రుణాలపై అందిస్తున్న మినహాయింపులను ఆపేసింది. ఈ బడ్జెట్‌లోనైనా ఆదాయపు పన్ను పరిమితిని కొంతమేర అయినా కేంద్ర ప్రభుత్వం పెంచుతుందని ఉద్యోగులు ఆశాభావంతో ఉన్నారు.

'ఉపాధి' కి కేటాయింపులు పెరిగేనా?

వ్యవసాయ సీజన్ ముగిసిన తర్వాత గ్రామాల్లో ప్రత్యామ్నాయ పనులకు ఉపాధి హామీ ఉంది. జిల్లాలో 2023-24లో 4.28 లక్షల జాబ్‌కార్డులు జారీ చేయగా 6.07 లక్షల మంది కూలీలు నమోదయ్యారు. ఈ ఏడాదిలో ఇప్పటివరకు 4.86 లక్షల మంది కూలీలు పనులకు వచ్చారు. 2023-24 బడ్జెట్‌లో రూ.60 వేల కోట్లు కేటాయించారు. ఈసారి ఉపాధి హామీ చట్టానికి నిధుల కేటాయింపులు పెరిగితే వీలైనంత ఎక్కువ మందికి పనులు కల్పించడంతో పాటు అభివృద్ధి పనులకు ఆస్కారం ఉంటుందని అధికారులు భావిస్తున్నారు.

712 ఖాళీలతో డిఎస్‌సి?

- ఉపాధ్యాయ నియామకాలకు కేబినెట్ గ్రీన్ సిగ్నల్
- నోటిఫికేషన్ విడుదలకు సన్నాహాలు



ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

ఉపాధ్యాయ ఖాళీల భర్తీకి డిఎస్‌సి (జిల్లా సెలక్షన్ కమిటీ) నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అమరావతిలో బుధవారం సమావేశమైన కేబినెట్ ఇందుకు ఆమోదం తెలిపింది. త్వరలో నోటిఫికేషన్ వెలువరించేందుకు సన్నాహాలు చేస్తోంది. జిల్లాకు సంబంధించి 712 ఖాళీలు ఉన్నట్లు సమాచారం. రెండు నెలల కిందటే జిల్లాలో ఖాళీల వివరాలతో అధికారులు ప్రభుత్వానికి నివేదిక పంపినట్లు తెలిసింది. రేషనలైజేషన్ తర్వాత ఏర్పడిన ఖాళీలు, పలు కారణాలతో ఏర్పడిన ఖాళీలను పాఠశాల విద్యాశాఖ పరిగణనలోకి తీసుకుని నోటిఫికేషన్‌లో పొందుపరిచినట్లు తెలిసింది. కొద్దిరోజుల్లో డిఎస్‌సి షెడ్యూల్‌ను ప్రకటించనుంది.

జిల్లాలో ఉన్న 712 ఖాళీల్లో ప్రభుత్వ, జిల్లా, మండల పరిషత్ పాఠశాలల్లో 527 ఖాళీలు ఉన్నట్లు సమాచారం. అందులో ఎస్‌జిటి 341 పోస్టులు, స్కూల్ అసిస్టెంట్ పోస్టులు 106, భాషా పండితులు 42 మంది, సంగీతం టీచర్ పోస్టు ఒకటి ఖాళీగా ఉంది. శ్రీకాకుళం కార్పొరేషన్‌తో పాటు మూడు మున్సిపాలిటీల్లో 65 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వీటిలో ఎస్‌జిటి 47 పోస్టులు, స్కూల్ అసిస్టెంట్ పోస్టులు 13, భాషా పండితులు నాలుగు, పిఇటి ఒక పోస్టు ఖాళీ ఉంది. జిల్లాలో ఏజెన్సీ ఏరియా పరిధిలోని గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యాన నడుస్తున్న పాఠశాలల్లో 35 ఖాళీలు ఉన్నట్లు తెలిసింది. వాటిలో ఎస్‌జిటిలు 24, స్కూల్ అసిస్టెంట్ పోస్టులు మూడు, భాషా పండితులు ఆరు, పిఇటి రెండు పోస్టులు ఉన్నాయి. గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యాన ఏజెన్సీయేతర ప్రాంతాల్లోని పాఠశాలల్లో 85 ఖాళీలు ఉన్నట్లు తెలుస్తోంది. వీటిలో ఎస్‌జిటి పోస్టులు 39, స్కూల్ అసిస్టెంట్ పోస్టులు 11, భాషా పండితులు 23, పిఇటి 12 ఖాళీలు ఉన్నట్లు సమాచారం

టెట్‌కు నేటి నుంచి దరఖాస్తుల స్వీకరణ

ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)కు నేటి నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దరఖాస్తుల ఆధారంగా పరీక్షల షెడ్యూల్‌ను నిర్ణయించనున్నారు. దరఖాస్తులు అధిక సంఖ్యలో వస్తే పరీక్షల నిర్వహణకే పది రోజులకు పైగా సమయం పట్టే అవకాశం ఉంది. టెట్‌తో పాటే డిఎస్‌సి దరఖాస్తులను స్వీకరిస్తారా?, మరో తేదీ నిర్ణయిస్తారా? అన్నది చూడాల్సి ఉంది. టెట్, డిఎస్‌సి రెండింటికీ దరఖాస్తుల స్వీకరణ పూర్తయ్యే నాటికి ఎన్నికల షెడ్యూల్ వచ్చే అవకాశం ఉంది. ఆ తర్వాత దీనిపై ప్రభుత్వం ఏవిధంగా ముందుకు వెళ్తుందో చూడాల్సి ఉంది.

మాట్లాడుతున్న జెఎసి జిల్లా అధ్యక్షులు సాయిరాం

30శాతం ఐఆర్ ప్రకటించాలి

కలెక్టరేట్ వద్ద యుటిఎఫ్ రిలే నిరాహార దీక్ష

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఉపాధ్యాయ, ఉద్యోగులకు 30శాతం ఐఆర్ వెంటనే ప్రభుత్వం ప్రకటించాలని, ఆర్థిక బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ యుటిఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా కలెక్టరేట్ వద్ద బుధవారం రిలే నిరాహార దీక్ష చేపట్టారు. దీక్షా శిబిరాన్ని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.కిషోర్ కుమార్, జెఎసి జిల్లా చైర్మన్ హనుమంతు సాయిరాం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రూ.18 కోట్ల పెండింగ్ బకాయిలు, సరెండర్ లీవ్, పిఎఫ్, ఎపిజిఎల్ఐ, మెడికల్ రీయింబర్స్‌మెంట్, డిఎలు, పిఆర్‌సి వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగున్నర ఏళ్లుగడిచినప్పటికీ ఉద్యోగులు, ఉపాధ్యాయుల హామీలు ఏ ఒక్కటి పరిష్కారం కాలేదని, ప్రతి పోరాటం సందర్భంగా కక్షపూరితంగా వ్యవహరిస్తూ ఇబ్బంది పెడుతుందన్నారు. అప్రజాస్వామ్య వైఖరి మారాలని, మెగా డిఎస్‌సి నోటిఫికేషన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్.బాబూరావు, బి.శ్రీరామ్మూర్తి మాట్లాడుతూ సమస్యలపై శాంతియుతంగా పోరాటం చేస్తుంటే, ప్రభుత్వం ఉపాధ్యాయులపై నిర్బంధాలు, అక్రమ కేసులు పెడుతూ భయాందోళనలకు గురిచేస్తోందని చెప్పారు. దీక్షలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చౌదరి రవీంద్ర, ఆర్.దమయంతి, జిల్లా కార్యదర్శి హెచ్.అన్నాజీరావు, పి.సూర్యప్రకాశరావు, ఎస్.స్వర్ణకుమారి, జి.సురేష్, రాష్ట్ర కౌన్సిలర్ వై.ఉమాశంకర్ పాల్గొన్నారు.

ఎస్‌పిపి పుష్పగుచ్ఛం అందిస్తున్న తిరుపతి నాయుడు

ఎఎస్‌పిలు బదిలీ

ప్రజాశక్తి - శ్రీకాకుళం

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అదనపు ఎస్‌పిలు టి.పి విఠలేశ్వర్ (క్రైమ్), జె.తిప్పేస్వామి (అడ్మిన్) బదిలీ అయ్యారు. జిల్లాలో మూడేళ్లుగా విధులు నిర్వహిస్తున్న విఠలేశ్వర్‌ను ఎసిబికి బదిలీ చేశారు. గతేడాది మేలో ఎఎస్‌పి అడ్మిన్‌గా బాధ్యతలు స్వీకరించిన తిప్పేస్వామిని అనంతపురంలోని పోలీస్ అకాడమీకి బదిలీ చేశారు. వారి స్థానంలో కాకినాడలో ఎస్ఇబి ఎఎస్‌పిగా పనిచేస్తున్న ప్రేమకాజల్ అడ్మిన్, ఏలూరు ఎస్‌సి, ఎస్‌టి డిఎస్‌పిగా పనిచేస్తున్న ఉమామహేశ్వరరావు క్రైమ్ ఎఎస్‌పిలుగా నియమించారు.

ఎస్ఇబి సూపరింటెండెంట్ బాధ్యతల స్వీకరణ

స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సూపరింటెండెంట్‌గా సిహెచ్.తిరుపతి నాయుడు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఎస్ఇబి ఎఎస్‌పిగా పనిచేసిన వి.ఎన్ మణికంఠ విశాఖపట్నం బదిలీ అయ్యారు. తిరుపతినాయుడు అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరులో ఎస్ఇబి సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహించారు. బాధ్యతల స్వీకరణ అనంతరం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్‌పి జి.ఆర్ రాధికను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.

ఎసిబికి చిక్కిన జిఎస్‌టిఒ కిషోర్

రూ.లక్ష లంచం తీసుకుంటూ పట్టుబడిన వైనం

ప్రజాశక్తి - పలాస

కాశీబుగ్గలోని రాష్ట్ర పన్నుల శాఖ కార్యాలయంలో జిఎస్‌టిఒగా పనిచేస్తున్న ఎన్.కిషోర్ కుమార్ అవినీతి నిరోధక శాఖకు బుధవారం చిక్కారు. జిఎస్‌టి రిటర్న్ ఇచ్చేందుకు గానూ రూ.లక్ష లంచం తీసుకుంటూ పట్టుబడ్డారు. ఎసిబి శ్రీకాకుళం డిఎస్‌పి బి.వి.ఎస్ రమణమూర్తి తెలిపిన వివరాల ప్రకారం... కిషోర్ కుమార్ రెండేళ్లుగా పలాసలో జిఎస్‌టిఒగా పనిచేస్తున్నారు. పలాసకు చెందిన జీడి వ్యాపారి తన వ్యాపారానికి సంబంధించి జిఎస్‌టి పన్నులు చెల్లించారు. ఇందుకు సంబంధించి ఆయనకు రూ.14 లక్షల జిఎస్‌టి రిటర్న్ రావాల్సి ఉంది. ఆ మొత్తం కోసం కాశీబుగ్గలోని రాష్ట్ర పన్నుల శాఖ కార్యాలయంలో జిఎస్‌టిఒ కిషోర్ కుమార్‌ను సంప్రదించారు. 'మీకేం డబ్బులు రావని, తిరిగి మీరే ఇంకా చెల్లించాల్సి ఉంటుందేమో చూడాలి' అని అన్నారు. తాను చెల్లించాల్సిన పన్నులన్నీ సక్రమంగా చెల్లించానని, తనకు రిటర్న్ వస్తాయని పరిశీలించాలని వ్యాపారి కోరారు. తనకు రూ.1.50 లక్షల లంచం ఇస్తే, రిటర్న్ మొత్తం వచ్చేలా చేస్తానని కిషోర్ కుమార్ చెప్పారు. చివరకు రూ.లక్ష ఇచ్చేందుకు ఒప్పందం కుదుర్చుకున్నారు. జిఎస్‌టిఒ తీరుతో విసిగిన వ్యాపారి ఎసిబి అధికారులను ఆశ్రయించారు. ప్రణాళిక ప్రకారం వ్యాపారి పన్నుల శాఖ కార్యాలయంలో జిఎస్‌టిఒకు రూ.లక్ష లంచం ఇస్తుండగా, అక్కడే మాటు వేసి ఉన్న ఎసిబి అధికారులు దాడి చేశారు. నగదును స్వాధీనం చేసుకున్న అనంతరం కార్యాలయంలోని ఫైళ్లను పరిశీఇంచారు. జిఎస్‌టిఒను అరెస్టు చేసి, విశాఖపట్నంలోని ఎసిబి కోర్టుకు గురువారం తరలించనున్నట్లు తెలిపారు. దాడిలో ఎసిబి సిఐ ఎన్.వి.రమణ, ఎస్ఐలు సత్యారావు, చిన్నంనాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

పట్టుబడిన నగదుతో జిఎస్‌టిఒ కిషోర్ కుమార్

పోటీలను ప్రారంభిస్తున్న కృష్ణదాస్

'ఆడుదాం ఆంధ్ర'తో మట్టిలో మాణిక్యాలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

మట్టిలో మాణిక్యాలను వెలికి తీయడానికే ఆడుదాం ఆంధ్ర పోటీలు అని జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ అన్నారు. కోడి రామ్మూర్తి స్టేడియంలో జిల్లాస్థాయి ఆడుదాం ఆంధ్ర పోటీలను ఎమ్మెల్యే, ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్‌తో కలిసి బెలూన్లు, పావురాలను ఎగురవేసి, క్రీడా పతాకాన్ని ఆవిష్కరించి బుధవారం ప్రారంభించారు. తొలుత ఆయా జట్లను పరిచయం చేసుకున్నారు. బ్యాటింగ్, వాలీబాల్ పోటీలను సర్వీస్ చేస్తూ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా నుంచి రాష్ట్రస్థాయిలో ప్రాతినిధ్యం వహించేలా ఆయా జట్లు ఉత్తమ ప్రతిభను కనబరచాలన్నారు.

జిల్లాలోని ఎనిమిది నియోజకవర్గాల్లో క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, బ్యాడ్మింటన్ పోటీల్లో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించిన సచివాలయం జట్లు నాలుగు రోజుల పాటు జిల్లా కేంద్రంలో పోటీల్లో పాల్గొని, విశాఖపట్నంలో రాష్ట్రస్థాయి పోటీలకు హాజరవుతాయని చెప్పారు. ఆరోగ్యం సరిగా ఉండాలంటే మన జీవితాల్లో క్రీడలు ఎంత అవసరమో తెలియజెప్పడానికి ఆడుదాం ఆంధ్ర గొప్ప క్యాంపెయిన్‌గా ఉపయోగపడిందన్నారు.

జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులను తయారు చేయాలన్న లక్ష్యంతో ఆడుదాం ఆంధ్ర అనే గొప్ప కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని ధర్మాన కృష్ణదాస్ అన్నారు. వైసిపి ప్రభుత్వం పూర్తిస్థాయిలో కిట్లను అందజేసి భోజన, వసతి సదుపాయాలు కల్పించి క్రీడాకారులకు ఎలాంటి లోటు లేకుండా చూస్తోందని చెప్పారు. క్రీడల్లో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. రాష్ట్రస్థాయి పోటీలకు వెళ్లే జిల్లా జట్లకు ప్రత్యేక ప్రోత్సాహకాలు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో డిఎస్‌డిఒ శ్రీధర్, జిల్లా విద్యాశాఖాధికారి కె.వెంకటేశ్వర్లు, సెట్‌శ్రీ సిఇఒ ప్రసాదరావు, శ్రీకాకుళం నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు, జిల్లా పర్యాటక శాఖ అధికారి ఎన్.నారాయణరావు, కోచ్ మాధురి, స్కూల్ గేమ్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి రమణ, నెహ్రూ యువ కేంద్రం కోఆర్డినేటర్ ఉజ్వల్ తదితరులు పాల్గొన్నారు.

భారీగా తహశీల్దార్ల బదిలీ

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో భారీగా తహశీల్దార్ల బదిలీలు జరిగాయి. జోనల్ స్థాయిలో ఈ బదిలీలు చేపట్టారు. జిల్లాకు 33 మంది తహశీల్దార్లను నియమిస్తూ అదనపు సిసిఎల్ఎ, కార్యదర్శి ఎమ్‌డి ఇంతియాజ్ ఉత్తర్వులు జారీ చేశారు. సిహెచ్.నాగమణి (పాడేరు), బి.నాగరాజు (ముంచింగిపుట్టు), పి.లచ్చుపాత్రుడు (చింతపల్లి), ఎస్.ఎల్.వి ప్రసాద్ (జి.కె వీధి), కె.వి ఈశ్వరరావు (విశాఖ కలెక్టరేట్), పి.రామారావు (విశాఖ కలెక్టరేట్), ఎల్.రామారావు (అనంతపురం), కె.వేణుగోపాల్ (పద్మనాభం), డి.వీరభద్రరరావు (ములగాడ), ఎ.మనోరంజిని (ఆర్‌డిఒ విశాఖపట్నం), జె.తారకేశ్వరి (ఆర్‌డిఒ భీమునిపట్నం), బి.టి.వి రామారావు (ఎస్‌డిసి విశాఖపట్నం), ఎం.వి.ఎస్.కె రవి (ల్యాండ్‌రిఫార్మ్స్), వి.శ్యామ్ కుమార్ (ఎల్ఎ), వి.నాగజ్యోతి (విజిలెన్స్), పి.లక్ష్మీదేవి (అనకాపల్లి), ఆర్.నర్సింహమూర్తి (అనకాపల్లి), ఎల్.తిరుమలబాబు (చోడవరం), ఎం.లక్ష్మి (దేవరాపల్లి), ఎస్.రాణిఅమ్మాజీ (యలమంచిలి), జె.రమేష్‌బాబు (కె.కోటపాడు), జి.సత్యనారాయణ (కశింకోట), పి.కనకారావు (పరవాడ), పి.భాగ్యవతి (రామ్‌బిల్లి), జె.సత్యనారాయణ (నర్సీపట్నం ఆర్‌డిఒ), బి.వి.రాణి (చీడికాడ), వై.ఎస్.వి.వి ప్రసాదరావు (గోల్కొండ), జానకమ్మ (కోటఉరట్ల), ఎం.వి.వి ప్రసాద్ (మాకవరంపాలెం), ఎస్.వి అంబేద్కర్ (నక్కపల్లి), ఎస్.ఎస్.వి.ఎస్ నాయుడు (నాతవరం), బి.రవికుమార్ (నర్సీపట్నం), కె.విజయ్‌కుమార్ (ఎస్.రాయవరం).

నేడు కలెక్టర్ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి- శ్రీకాకుళం

నూతన కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్ గురువారం బాధ్యతలు స్వీకరించనున్నారు. ఇప్పటివరకు పనిచేసిన కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్‌ను బదిలీ చేస్తూ... ఆయన స్థానంలో నంద్యాల జిల్లా కలెక్టర్‌గా పనిచేస్తున్న మనజీర్ జిలానీ సామూన్‌ను ఇక్కడ నియమించిన విషయం పాఠకులకు విదితమే.

ప్రత్యేక హోదా కోసం ఉద్యమించాలి / బాలిక అనుమానాస్పద మృతి

మెయిన్‌లో...

ఓటర్ల జాబితా సవరణలకు 10,304 దరఖాస్తులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఓటర్ల జాబితాలో పేరు, చిరునామా తదితర సవరణల కోసం ఇప్పటివరకు 10,304 దరఖాస్తులు వచ్చాయని జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు తెలిపారు. గడిచిన వారం రోజుల్లో మార్పులు, చేర్పుల కోసం 4,227 దరఖాస్తులు అందాయన్నారు. కలెక్టరేట్‌లోని ఆయన ఛాంబరులో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో 31వ వారపు సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక ఓటర్ల సవరణ జాబితాలో ఏవైనా అభ్యంతరాలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. తాజాగా వచ్చిన ఫారం 6, 7, 8ను పరిశీలించి సప్లిమెంటరీ ఓటరు జాబితాలో చేరుస్తామన్నారు. డిసెంబరు 12 నుంచి ఇప్పటివరకు 12,267 మంది ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. వీరిని సప్లమెంటరీ జాబితాలో చేర్చనున్నట్లు తెలిపారు. చిరునామా, పేరు, ఇతర సవరణలు కోరుతూ 10,304 మంది దరఖాస్తు చేసుకున్నారని వీటిలో 454 తిరస్కరించగా, 4,424 పెండింగ్‌లో ఉన్నాయని మిగిలిన వాటిని ఆమోదించామన్నారు. సమావేశంలో వైసిపి నాయకులు రౌతు శంకరరావు, టిడిపి నాయకులు కె.వి రామరాజు, కాంగ్రెస్ నాయకులు డి.మల్లిబాబు, బిజెపి నాయకులు సురేష్‌బాబు సింగ్, బిఎస్‌పి నాయకులు సోమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న డిఆర్‌ఒ గణపతిరావు

ఆమదాలవలస పురపాలక సంఘం

టెండరు నోటీసు

రేఖా నెం.13/2024/DMF/ఇ1, తేది:31-01-2024

ఆమదాలవలస పురపాలక సంఘం పరిధిలో ఈ దిగువ తెలిపిన పనులకు ఇ - ప్రొక్యూర్‌మెంటు ద్వారా టెండర్లు కోరబడుచున్నవి.

(1) డిస్ట్రిక్ట్ మినరల్స్ ఫౌండేషన్ గ్రాంట్ పనులు :1, (2వ పిలుపు), అంచనా కాంట్రాక్ట్ విలువ: రూ. 13, 78,711/-, **(2)** GGMP గ్రాంట్ పనులు:1,(3వ పిలుపు), అంచనా కాంట్రాక్ట్ విలువ: రూ. 3,90,399/-, **(3)** సాధారణ నిధుల పనులు:1, (3వ పిలుపు), అంచనా కాంట్రాక్ట్ విలువ: రూ. 9,27,176/-

బిడ్ డాక్యుమెంట్ డౌన్ చేయుటకు ప్రారంభ తేది: **01-02-2024 ఉ. గం.11.00లకు,**
బిడ్ డాక్యుమెంట్ డౌన్ లోడ్ చేయుటకు ఆఖరు తేది: **05-02-2024 మ. గం.1.00లకు,**
బిడ్ స్వీకరించుటకు ఆఖరు తేది: **05-02-2024 మ. గం.4.00లకు,**
ప్రైస్ బిడ్ తెరుచు తేది:**05-02-2024 సా. గం.5.00లకు,** ఇతర వివరములకు ఆఫీసు పనివేళల్లో సంబంధిత విభాగ అధికారులను సంప్రదించి తెలుసుకొవచ్చును.

కమీషనరు ఆమదాలవలస పురపాలక సంఘం

IN THE HON'BLE COURT OF THE PRINCIPAL SENIOR CIVIL JUDGE AT SRIKAKULAM
1.P.No. 09/2021

Between:
Balivada Malleswara Rao ...petitioner
And:
Pingali Srinivas and others ...Respondents

NOTICE

To,
R-2. Ijju Anuradha, W/o. Damodara Rao, aged 56 years, Prakashnagar Colony, Srikakulam Town and Dt.

Please take notice that the above named plaintiff has instituted the above suit against you and the same is stands posted to **26-02-2024 at 10.30 A.M.** for yours' appearance. On that day you shall personally or through an Advocate attend before the above named Hon'ble Principal Senior Civil Judge Court, Srikakulam, failing which the matter will be heard and determined in your absence ex-parte as per law.

// By Court Order //

CH.SATYANARAYANA
ADVOCATE,
AMADALAVALASA,
CELL:9848098139.

Amadalavalasa
Date: 31.01.2024.

జాతీయ పోటీలకు అక్కా తమ్ముడు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఎంపికైన ఇక్షిత, సాత్విక్

పట్టణంలో ఎపిహెచ్‌బి కాలనీలో నివాసం ఉంటున్న జామి ఇక్షిత, జామి సాత్విక్‌లు తైక్వాండోలో విలక్షణమైన ఆటతీరుతో ఆకట్టుకుంటున్నారు. జామి కిరణ్, ప్రవంతి వీరి తల్లిదండ్రులు. ఇప్పటికే అనేక రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో ప్రాతినిధ్యం వహించి, పతకాలతో సత్తాచాటిన వీరిద్దరు మరోసారి జాతీయ పోటీలకు ఎంపికయ్యారు. ఆంధ్రప్రదేశ్ తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యాన జనవరి 20, 21 తేదీల్లో నంద్యాల జిల్లాలో జరిగిన ఖేలో ఇండియా రాష్ట్రస్థాయి ఎంపిక పోటీల్లో వీరు బంగారు పతకాలను సాధించి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈనెల 7 నుంచి 9వరకు పుదుచ్చేరి వేదికగా జాతీయ పోటీలు జరుగనున్నాయి. వీరి రాణింపుపై తైక్వాండో జిల్లా సంఘ ప్రతినిధులు, కోచ్‌లు, తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఇక్షిత విశాఖలోని ఓ ప్రైవేటు పాఠశాలలో 9వ తరగతి చదువుతోంది. సాత్విక్ పట్టణంలోని ఓ ప్రైవేటు స్కూల్లో 6వ తరగతి చదువుతున్నారు. పట్టణంలో టౌన్‌హాల్‌లో స్కూల్ ఆఫ్ తైక్వాండోలో కోచ్ మజ్జి గౌతమ్ వీరికి శిక్షణ ఇస్తున్నారు.

వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

మధ్యాహ్న భోజన కార్మికుల ధర్నా

ప్రజాశక్తి- పలాస

ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం నిర్వహణకు ప్రభుత్వమే గ్యాస్ సరఫరా చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్.గణపతి డిమాండ్ చేశారు. స్థానిక ఎంఇఒ కార్యాలయం వద్ద మధ్యాహ్న భోజన పథకం కార్మికులు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బుధవారం ధర్నా చేపట్టారు. అనంతరం ఎంఇఒలు సిహెచ్.శ్రీనివాసరావు, సత్యంలకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మెనూ ఛార్జీలకు రూ.20 చెల్లించాలన్నారు. పాదయాత్రలో ఇచ్చిన సిఎం హామీ మేరకు రూ.పది వేలు వేతనం చెల్లించాలన్నారు. ప్రతినెలా 5లోగా వేతనాలు, బిల్లులు చెల్లించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు కనీసం మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. కార్మికులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. పథకాన్ని ప్రయివేటు సంస్థలకు అప్పగించరాదన్నారు. ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని, వంట చేసేటప్పుడు అగ్నిప్రమాదానికి గురైన వారిని నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఏడాదికి రెండు జతల యూనిఫాం అందజేయాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు పి.భూదేవి, బి.శకుంతల, పుణ్యవతి, పి.సావిత్రి, మహాలక్ష్మి, పద్మ, రూపావతి, రంభలు పాల్గొన్నారు.

'టిడిపిలో' చేరలేదు

టెక్కలి రూరల్ : మండలంలోని రావివలస పంచాయతీలో 70 మంది టిడిపి కండువాలు వేసుకుని పార్టీ కలిసినట్లు సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని వైసిపి సర్పంచ్ సర్లాన బాలకృష్ణ ఒక ప్రకటనలో అన్నారు. టిడిపిలో 70 మంది కలిసినట్లు ప్రచారం చేస్తున్నారని, వారి పేర్లు చెప్పగలరా? ప్రశ్నించారు. కండువాలు టిడిపి కార్యకర్తలకే వేసుకున్నారని వ్యాఖ్యానించారు. వైసిపి ప్రభుత్వంపై తప్పుడు ప్రచారాలు మానుకోవాలని సూచించారు. జన్మభూమి కమిటీ లాగా అవినీతి పాలనా చేయలేదని అన్నారు.

మహిళా పక్షపాతి జగన్

ప్రజాశక్తి- ఆమదాలవలస

మహిళలకు ఇచ్చిన మాటకు కట్టుబడి నాలుగు దశల్లో స్వయం సహాయక సంఘాలకు రుణమాఫీ పూర్తిచేసి మహిళా పక్షపాతిగా జగన్మోహన్‌రెడ్డి సుస్థిరస్థానం సంపాదించు కున్నారని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. బుధవారం ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో జరిగిన నియోజకవర్గస్థాయి వైఎస్ఆర్ ఆసరా నిధుల విడుదల, పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2019 ఎన్నికల్లో ఇచ్చిన హామీలను శతశాతం పూర్తి చేసిన ఏకైక ముఖ్యమంత్రిగా జగన్మోహన్ రెడ్డి చరిత్ర సృష్టించారన్నారు. సంక్షేమ పథకాలను మహిళలకే కేటాయిస్తూ మహిళలకు తగిన గౌరవాన్ని కల్పించారన్నారు. పాలనలో పారదర్శక విధానాలతో దేశానికే ఆదర్శవంతమైన పాలనను కొనసాగిస్తున్న జగన్మోహన్‌రెడ్డి నాయకత్వాన్ని బలపరచాలని మహిళలను కోరారు. ఆసరాలో భాగంగా నియోజకవర్గానికి నాలుగో విడతలో రూ.30.74 కోట్ల నిధులను విడుదల చేయడం జరిగిందన్నారు. ముందుగా జగన్మోహన్ రెడ్డి చిత్రపటానికి మహిళలతో కలిసి పాలాభిషేకం చేశారు. అనంతరం ఆసరా నిధుల నమూనా చెక్కును మహిళలకు అందజేశారు. కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి తమ్మినేని వెంకట శ్రీరామ్ చిరంజీవి నాగ్, డిఆర్‌డిఎ పిడి డి.విద్యాసాగర్, మెప్మా పిడి ఎం.కిరణ్ కుమార్, మున్సిపల్ కమిషనర్ ఎం.రవిసుధాకర్, వైసిపి నాయకులు కెవిజి.సత్యనారాయణ, బొడ్డేపల్లి రమేష్

ఇచ్ఛాపురం : నమూనా చెక్కును అందజేస్తున్న విజయ



ఆమదాలవలస : నమూనా చెక్కును పంపిణీ చేస్తున్న స్పీకర్ సీతారాం

కుమార్, గురుగుబెల్లి శ్రీనివాసరావు, ఆమదాలవలస, పొందూరు, సరుబుజ్జిలి, బూర్జ మండలాల నాయకులు, ఎంపిడిఒలు, వెలుగు, మెప్మా ఎపిఎంలు, సిసిలు, సిఒలు, ఆర్‌పిలు, సిఎఫ్‌లు, స్వయం సహాయక సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : పట్టణంలోని వైఎస్ఆర్ టూరిజం పార్కులో వైఎస్ఆర్ ఆసరా నాలుగో విడత నమూనా చెక్కును జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ అందజేశారు. కార్యక్రమంలో రెడ్డిక కార్పొరేషన్ చైర్మన్ దుక్క లోకేశ్వరరెడ్డి, ఎంపిపి బోర పుష్ప, జెడ్‌పిటిసి ఉప్పడ నారాయణమ్మ, మున్సిపల్ చైర్‌పర్సన్లు భారతీదివ్య, లాభాల స్వర్ణమని, టౌన్ పార్టీ అధ్యక్షులు బలివాడ ప్రకాష్ పట్నాయక్, జెసిఎస్ మండల అధ్యక్షులు ఆశి పురుషోత్తం పాల్గొన్నారు.

వైసిపి పాలనలో అవస్థలు

టిడిపి రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

వైసిపి అరాచక పాలనలో ప్రజలు అవస్థలు పడుతున్నారని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు, ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. మండలంలోని తిలారు పంచాయతీ గవిరమ్మపేట, రేగులపాడు పంచాయతీ పేటపాడు, ఎత్తురాళ్లపాడు పంచాయతీ వంతలపేట, ఎత్తురాళ్లపాడు గ్రామాల్లో బుధవారం బాబు షూరిటీ-భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టిడిపి, జనసేన ప్రభుత్వం ఏర్పాటు కాగానే బిసిలకు రక్షణ చట్టాన్ని తీసుకొస్తామన్న హామీనిచ్చారు. ఐదేళ్ల వైసిపి పాలనలో అభివృద్ధికి 20 ఏళ్లు వెనుకబడ్డామని అన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కింజరాపు హరివరప్రసాద్, బోయిన రమేష్, వెలమల కామేశ్వరరావు, విజయలక్ష్మి, తర్ర రామకృష్ణ, పూజారి శైలజ, జనసేన నాయకులు పల్లి కోటేశ్వరరావు,

మహిళతో మాట్లాడుతున్న అచ్చెన్నాయుడు

పాగోటి అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

పలువురు చేరిక

కోటబొమ్మాళి టిడిపి కార్యాలయంలో వైసిపి నాయకులు టిడిపిలోకి చేశారు. వారికి అచ్చెన్నాయుడు పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. టెక్కలి మండలం అయోధ్యపురం పంచాయతీకి చెందిన వార్డు మెంబర్ దాసరి రాము, నర్సు అమిస్ ఆయన అనుచర కుటుంబాలు చేరాయి.

నరసన్నపేట : స్థానిక శివనగర్ కాలనీలో బాబు ష్యూరిటీ-భవిష్యత్ కార్యక్రమాన్ని మాజీ ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జి.చిట్టిబాబు, రామారావు, వరదరాజు, కింజరాపు రామారావు పాల్గొన్నారు.

అనురాధ సేవలు అభినందనీయం

డిఎంహెచ్‌ఒ బి.మీనాక్షి

అనురాధను సన్మానిస్తున్న డిఎంహెచ్‌ఒ మీనాక్షి

శ్రీకాకుళం అర్బన్ : జిల్లా వైద్య ఆరోగ్యశాఖ పరిధిలో టిబి, లెప్రసీ విభాగాలతో పాటు అదనపు డిఎంహెచ్‌ఒ బాధ్యతలను డాక్టర్ అనురాధ ఎంతో సమర్ధవంతంగా నిర్వహించారని, ఆమె సేవలు అభినందనీయమని డిఎంహెచ్‌ఒ డాక్టర్ బి.మీనాక్షి అన్నారు. డాక్టర్ అనురాధ స్వచ్ఛంద ఉద్యోగ విరమణ సందర్భంగా బుధవారం డిఎంహెచ్‌ఒ కార్యాలయంలో ఉద్యోగులు ఆమెను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆమెకు శాలువకప్పి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మీనాక్షి మాట్లాడుతూ వైద్యఆరోగ్య శాఖ పరిధిలో తనకు ఎంతో తోడ్పాటుగా నిలిచారన్నారు. విధి నిర్వహణలో ఆమె మంచి పేరు తెచ్చుకున్నారన్నారు. భవిష్యత్‌లో ఆరోగ్యవంతమైన జీవనాన్ని సాగించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా మాస్ మీడియా అధికారి పైడి వెంకటరమణ మాట్లాడుతూ పేదలకు నిస్వార్ధమైన సేవలు, వృత్తిపరమైన బాధ్యతలను ఎంతో సమర్ధతతో నిర్వర్తించారన్నారు. సన్మాన గ్రహీత అనూరాధ మాట్లాడుతూ వైద్య వృత్తి ఎంతో సంతృప్తి నిచ్చిందన్నారు. భవిష్యత్‌లో పేదలకు తనవంతు సేవలందిస్తానన్నారు. కార్యక్రమంలో డా పి.ప్రకాశరావు, డా సిపి శ్రీదేవి, డా సుజాత, డా వెంకట లక్ష్మి, డా ప్రవీణ్ కుమార్, శైలజా, వెంకటేశ్వరరావు, కె.వి. నారాయణరావు, సూర్యకళ, మోహిని పాల్గొన్నారు.

రుణాలు రెన్యువల్ చేసుకోవాలి

కోటబొమ్మాళి: మండలంలోని కోటబొమ్మాళి ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం పరిధిలో పంట రుణాలు తీసుకున్న రైతులంతా ఫిబ్రవరి నెలాఖరులోగా ఏడు శాతం వడ్డీతో చెల్లించి రెన్యువల్ చేసుకోవాలని పిఎసిఎస్ అధ్యక్షులు బాడాన మురళి తెలిపారు. మండల కేంద్రంలోని పిఎసిఎస్ కార్యాలయంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. రుణం తీసుకున్న రైతులు పిఎసిఎస్ సిబ్బందికి సహకరించి రెన్యూవల్ చేసుకోవాలని కోరారు. వడ్డీతో పాటు రైతుకు సంబంధించిన వన్ బి, ఆధార్ కార్డు జిరాక్స్ కాఫీలను అందివ్వాలన్నారు. ఫిబ్రవరిలో చెల్లించకుంటే అధిక వడ్డీతో రుణం మొత్తం చెల్లించాల్సి వస్తుందన్నారు. ఈ పరిస్థితిని దృష్టిలో పెటు్టకొని రుణాలు రెన్యువల్ చేసుకోవాలని సూచించారు. ఈయనతో పాటు సిఇఒ మెండ సత్యనారాయణ ఉన్నారు.

వ్యాసరచన పోటీలో విద్యార్థుల ప్రతిభ

నరసన్నపేట : సత్యసాయి జయంతి సందర్భంగా నిర్వహించిన రాష్ట్రస్థాయి వ్యాస రచన పోటీల్లో స్థానిక పద్మావతి కళాశాల విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచారు. సమితి స్థాయిలో ఇంటర్మీడియట్ విద్యార్థులు వాన పవిత్ర, సానియా పర్వీన్, డిగ్రీ విద్యార్థిని అల్లు మహాలక్ష్మి వివిధ విభాగాల్లో ప్రథమ బహుమతులు సాధించారు. వీరిని అభినందిస్తూ స్థానిక మారుతి నగర్ సాయి మందిర్ కన్వీనర్ ఎం.లక్ష్మంనాయుడు, మహిళా సేవా విభాగం జిల్లా కన్వీనర్ ఎం.అమ్మాయమ్మ విజేతలకు పతకాలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ సిహెచ్.దుర్గాప్రసాద్, ప్రిన్సిపాల్ ఇ.ఎం.నాయుడు, ఎఒ మోహన్‌దాస్ పాల్గొన్నారు.

బహుమతులను అందజేస్తున్న లక్ష్మంనాయుడు

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు మృతి

ప్రజాశక్తి- నందిగాం

మండలంలోని పెద్దబాణాపురం, మద్దిలవానిపేట వద్ద వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మెళియాపుట్టి మండలం జాలిభద్రకు చెందిన వంజంగి గణపతి (51) టెక్కలి వైపు బైక్‌పై వస్తున్నారు. టెక్కలి వైపు నుంచి వస్తున్న కారు్డ పెద్దబాణాపురం వద్ద ఢీకొనడంతో మృతి చెందారు. అలాగే నందిగాంకు చెందిన నక్క బాలకృష్ణ (35) తన బైక్‌పై మంగళవారం రాత్రి టెక్కలి నుంచి స్వగ్రామానికి వస్తున్నాడు. బైక్ బోల్తా పడడంతో తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే స్థానికులు 108లో టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు ప్రథమ చికిత్స నిర్వహించి రిఫర్ చేశారు. కుటుంబ సభ్యులు జిల్లా కేంద్రంలోని ఓ ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించి బుధవారం మృత్యు వాత పడ్డాడు. మృతుడికి భార్య మహాలక్ష్మి, కుమారులు సిద్ధార్, కౌశిక్తులు, తల్లి వానమ్మ ఉన్నారు. హెచ్‌సి ఢిల్లేశ్వరరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఖాదీ వస్త్రాల తయారీని పరిశీలిస్తున్న కెజిబివి విద్యార్థులు

కెజిబివి విద్యార్థుల క్షేత్ర పర్యటన

పొందూరు: మండలం లోలుగు కెజిబివి 9వ తరగతి విద్యార్థులకు వృత్తి విద్యాకోర్సులపై అవగాహన కల్పిస్తూ బుధవారం క్షేత్రపర్యటనను జరిపినట్లు ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ ఫ్లోరెన్స్ విజయకుమారి తెలిపారు. మండల కేంద్రంలో ఎఎఫ్‌కెకె సంఘంలో ఖాదీ వస్త్రాల తయారీ ప్రక్రియలతో పాటు, కార్మికుల నైపుణ్యాలను విద్యార్థులు పరిశీలించినట్లు తెలిపారు. ఈ క్షేత్రపర్యటనను యువశక్తి శిక్షానిక్ ఎవమ్ సామూహిక వికాస్ సంస్థ సహాయంతో చేపట్టినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో వృత్తివిద్యా కోర్సు ట్రైనర్ బి.మణమ్మ, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

రికార్డులను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ నూరుల్ కమర్

నాలాను వసూలు చేయాలి

మెళియాపుట్టి : పంట పొలాల్లో వేసి లేఅవుట్లు, సిమెంట్ బ్రిక్స్ యాజమాన్యాల వద్ద నుంచి నాలాను వసూలు చేయాలని టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్ కమర్ ఆదేశించారు. మండలంలోని రామచంద్రపురంలో సిమెంట్ బ్రిక్ పరిశ్రమ, జరిభద్రలో వేసిన లేఅవుట్‌ను బుధవారం పరిశీలించారు. అనంతరం అందుకు సంబంధించి భూ రికార్డులను పరిశీలించారు. అలాగే వసుంధర సచివాలయంలో ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలించారు. ఈయన వెంట తహశీల్దార్ పి.సరోజని, ఆర్ఐ వైకుంఠరావు, విఆర్‌ఒలు అన్నాజీరావు, రమణ, సత్యనారాయణ ఉన్నారు.

అవగాహన కల్పిస్తున్న సిఐ వేణుగోపాలరావు

చట్టాలపై అవగాహన

కొత్తూరు: చట్టాలపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని సిఐ ఆర్.వేణుగోపాలరావు అన్నారు. స్థానిక వెంటకసాయి డిగ్రీ, జూనియర్ కళాశాలల విద్యార్థులకు బుధవారం చట్టాలపై అవగాహన కల్పించారు. పాక్సో చట్టం, సైబర్ క్రమ్‌లపై వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు ఎల్.రామచంద్రనాయుడు, హేమసుందరరావు, ఎల్.కృష్ణారావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వెంకటరమణ

మన్మథరావు ఆశయాలు కొనసాగిద్దాం

కోటబొమ్మాళి: భారత కమ్యూనిస్టు పార్టీ సీనియర్ నాయకులు మన్మథరావు ఆశయాలను కొనసాగించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి చాపర వెంకటరమణ అన్నారు. మండలంలోని నిమ్మడలో బుధవారం ఏర్పాటు చేసిన సంతాప సభలో పాల్గొని మాట్లాడారు. మన్మథరావు విద్యార్థి, యువజన సంఘాల్లో, భారత కమ్యూనిస్టు పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యునిగా ఆయన కొనసాగారని అన్నారు. అనేక భూ పోరాటాలు చేసి పేదల ఇళ్ల స్థలాల కోసం ఎనలేని సేవలు చేశారని అన్నారు. పార్టీ కోసం అంకితభావంతో పనిచేశారన్నారు. మన్మథరావు మృతి పార్టీకి తీరని లోటన్నారు. కార్యక్రమంలో ఎఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎం.యుగంధర్, జిల్లా ప్రధాన కార్యదర్శి కొన్న శ్రీనివాసరావు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చిక్కాల గోవిందరావు పాల్గొన్నారు.

లక్ష్మీనారాయణను కలిసిన న్యాయవాదులు

శ్రీకాకుళం అర్బన్ : జిల్లాలో పర్యటించిన మాజీ జాయింట్ డైరెక్టర్ లక్ష్మీనారాయణను బార్ అసోసియేషన్ అధ్యక్షులు, డాక్టర్ ఎన్ని సూర్యారావు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనతో మాట్లాడుతూ న్యాయవాదులకు గొడ్డలిపెట్టుగా మారిన ల్యాండ్ టైట్లింగ్ యాక్టు రద్దుకు మద్దతివ్వాలని కోరారు. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా న్యాయవాదులు అనేక పోరాటాలు చేపట్టిన విషయాన్ని ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. ఈయనతో పాటు బిసి అడ్వకేట్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఆగూరు ఉమామహేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి చౌదరి లక్ష్మణరావు, సీనియర్ న్యాయవాది కిల్లి మార్కేండేయులు కలిశారు.

పలువురికి కారుణ్య నియామకాలు

శ్రీకాకుళం అర్బన్ : జిల్లా ప్రజా పరిషత్ యాజమాన్యంలో ఉపాధ్యాయులుగా, ఉద్యోగులుగా వివిధ కేడర్లలో పనిచేస్తూ మృతి చెందిన ఉద్యోగుల కుటుంబాలకు కారుణ్య నియామకాలు చేపట్టారు. ఈ మేరకు ఉద్యోగ ధ్రువపత్రాలను జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ బుధవారం అందజేశారు. బాధ్యతగా పనిచేస్తూ మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

జీడి గిట్టుబాటు ధరకు కృషి చేయాలి

శిరీషకు వినతిపత్రం అందజేస్తున్న రైతుసంఘం నాయకులు

ప్రజాశక్తి- పలాస

ఉద్దాన ప్రాంత రైతులు జీడిపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారని, జీడికి గిట్టుబాటు ధర కల్పించేందుకు కృషి చేయాలని రైతాంగ సమస్యల సాధన కమిటీ జిల్లా అధ్యక్షులు మామిడి మాధవరావు కోరారు. మండలంలోని బొడ్డపాడులో రాజకీయ పార్టీ నాయకులను ప్రశ్నించే కార్యక్రమంలో భాగంగా అటుగా పర్యటిస్తున్న టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీషను బుధవారం కలిసి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జీడిపిక్కల బస్తా (80 కేజీల)కు రూ.16 వేలు గిట్టుబాటు ధర కల్పించి ఆర్‌బికెల ద్వారా ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ... ప్రభుత్వం స్పందించడం లేదని అన్నారు. తిత్లీ తుపానుతో నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందించే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. వంశధార జలాలను ఇచ్ఛాపురం వరకు పొడిగించి ఆ ప్రాంత రైతులకు సాగునీరు అందే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ఈ నెల 5న పలాస, ఇచ్ఛాపురం ప్రాంతాల్లో టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పర్యటనల్లో జీడి, కొబ్బరి రైతుల సమస్యలను విన్నవించుకునేందుకు అవకాశం కల్పించాలని విన్నవించారు. వినతిపత్రం అందజేసిన వారిలో కిక్కర ఢిల్లీరావు, తామాడ తిలోచనరావు, దాసరి శ్రీరాములు, మద్దిల ధర్మారావు, వడ్డి సింహాద్రి, రాజాం గుణవంతు పాల్గొన్నారు.

'ఐతమ్' విద్యార్థులకు శిక్షణ

టెక్కలి రూరల్: టెక్కలి ఆదిత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ ఇంజినీరింగ్ కళాశాల బిటెక్ సివిల్ ఇంజినీరింగ్ ద్వితీయ ఏడాదికి చెందిన 132 మంది విద్యార్థులకు గత నెల 22 నుంచి ఫిబ్రవరి 3 వరకు 'రివిట్ ఆర్కిటెక్చర్'పై ఐతమ్ సిఎంస్ ఎక్సైన్స్ ల్యాబ్లో శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్టు కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. డ్రాయింగ్ ఆఫ్ బిల్డింగ్ ప్లాన్ ఇన్ రివిట్ ఆర్కి టెక్చర్, ప్రొజెక్షన్ ఆఫ్ ప్లాన్స్ అండ్ ఎలివేషన్స్, త్రీడి మోడలింగ్ ఆఫ్ రెసిడెన్షియల్ అండ్ డ్వెల్లింగ్ హార్డ్, కెమేరా వ్యూ అండ్ వాక్ త్రూ విత్ రివిట్ వెర్షన్, అసైనింగ్ ఆఫ్ వేరియస్ కాంపోనెంట్స్ టు త్రీడి ప్లాన్స్,

మాట్లాడుతున్న నాగేశ్వరరావు

మెటీరియల్ ఎస్టిమేషన్ అండ్ షెడ్యూలింగ్ ఆఫ్ కాంపోనెంట్స్ అనే అంశాలపై ప్రత్యేక శిక్షణ పొందిన బి.దాలి నాయుడు విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నట్టు పేర్కొన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, సివిల్ హెచ్‌డి డాక్టర్ పి.దినకర్, ఎపిఎస్ఎస్ఎసి స్పాక్ డాక్టర్ వి.అశోక్‌కుమార్, సివిల్ విభాగ కో-ఆర్డినేటర్ బి.షన్ముఖరావు, సిఎంస్ సెక్షన్ కో-ఆర్డినేటర్ కె.బి.అనూషలు శిక్షణా తరగతులను పర్యవేక్షిస్తున్నారని తెలిపారు.

పలాస చేరిన 'పివిఆర్' పాదయాత్ర

పలాస : తెలగలను బిసిలో చేర్చాలనే ప్రధాన డిమాండ్‌తో ఇచ్ఛాపురంలో చేపట్టిన పల్లంట్ల వెంకటరామారావు (పివిఆర్) పాదయాత్ర బుధవారం పలాస చేరుకుంది. కోసంగిపురం కూడలి వద్ద పలాసకు చెందిన తెలగ సంఘ నాయకులు అక్కడికి చేరుకొని ఆయనకు సంఘీభావం తెలిపారు. ఇచ్ఛాపురం నుంచి పాయకరావుపేట వరకు పాదయాత్ర నిర్వహించనున్నారు. ఈ పాదయాత్రలో విజయకుమార్, శ్రీనివాసరావు, అల్లాడ శ్రీనివాసరావు, లింగం సూర్యనారాయణ, లింగం సత్యనారాయణలు పాల్గొన్నారు.

ఇళ్లస్థలాలు మంజూరు చేయాలని వినతి

వినతిపత్రం అందజేస్తున్న జర్నలిస్టులు

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

ప్రభుత్వం ఇచ్చిన అక్రిడేషన్‌తో సంబంధం లేకుండా మీడియా సంస్థ ఇచ్చిన గుర్తింపు కార్డు పరిగణలోకి తీసుకుని ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు కూన సుదర్శనరావు కోరారు. ఈ మేరకు ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్‌ను బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఎమ్మెల్సీ మాట్లాడుతూ నిత్యం వార్తలు సేకరించి ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా నిలుస్తున్న పత్రిక, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులను గుర్తించి ఇళ్ల స్థలాలు మంజూరు చేస్తానని తెలిపారు. టెక్కలి ప్రెస్ క్లబ్ భవన నిర్మాణకి రూ.2 లక్షలు విరాళంగా ఇస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ సభ్యులు బగాది వాసుదేవరావు, లింగుడు రమణ, సుంకు గోపీనాథ్, డి.ఈశ్వరరావు, మార్పు పద్మలోచనరావు, అభిరామ్, వి.రాజేష్, దవళ కిరణ్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న స్వర్ణమణి

మున్సిపల్ వకీలు నియామకంపై చర్చ

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

మున్సిపల్ స్టాండింగ్ కౌన్సెల్ కాలపరిమితి ముగుస్తున్న సందర్భంగా కొత్తగా స్టాండింగ్ కౌన్సెల్ వకీలు నియామకంపై తీవ్ర చర్చ జరిగింది. మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజ్యలక్ష్మి అధ్యక్షతన బుధవారం కౌన్సెల్ సాధారణ సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఎజెండాలో అంశాలపై చర్చ జరుగుతున్న సమయంలో స్టాండింగ్ వకీలు నియామకంపై వచ్చిన ఐదు దరఖాస్తులపై వైస్ చైర్‌పర్సన్ లాభాల స్వర్ణమణి మాట్లాడుతూ కొత్త వకీలు నియామకం చేపట్టాలని కోరారు. ఆదివారంతో గడువు తేదీ ఎలా పెట్టారని అన్నారు. దరఖాస్తుల స్వీకరణకు ఆదివారం అయితే... మరసటి రోజు స్వీకరించవచ్చు పేర్కొన్నారు. న్యాయపరమైన అంశాలు ఉండడంతో క్లారిటీ కోసం ఈ అంశం వాయిదా వేస్తున్నట్లు చైర్‌పర్సన్ ప్రకటించారు. ఎన్నికల కోడ్ అడ్డు వస్తుందని, 15 రోజుల్లో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి స్టాండింగ్ వకీలు నియామకం చేపట్టాలని స్వర్ణమణి పట్టు పట్టారు. చైర్‌పర్సన్ మాత్రం అంగీకారం తెలపకుండ క్లారిటీ వచ్చిన తరువాత సమావేశం ఏర్పాటు చేసుకోవచ్చు, అప్పటి వరకు వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. అభివృద్ధి పనులకు బిల్లుల చెల్లింపు వేగవంతానికి చర్యలు తీసుకోవాలని టిడిపి కౌన్సిలర లాలీరాణి సూచించారు. కొన్ని వార్డుల్లో కౌన్సిలర్లు స్వయంగా డబ్బులు ఖర్చు పెట్టి చేసినా అభివృద్ధి పనులు చేశారని, ఇప్పటికీ బిల్లులు చెల్లించలేదని అన్నారు. సమావేశం వైస్‌చైర్‌పర్సన్ భారతీ దివ్య, కో-ఆప్షన్ సభ్యులు ప్రత్తి విజయా కుమార్, అధికారులు పాల్గొన్నారు.

మున్సిపల్ బడ్జెట్ ఆమోదం

మున్సిపల్ 2023-24, రివైజ్ 2024-25 అంచనా బడ్జెట్‌లో స్వల్ప సవరణలతో మున్సిపల్ కౌన్సెల్ ఏకగ్రీవంగా ఆమోదించింది. 2024లో అంచనా బడ్జెట్‌లో ప్రారంభ నిల్వ రూ.17,2,73,462 చూపించారు. సాధారణ నిధుల రాబడి మొత్తం రూ.8,32,27,000, మూలధనం నిధుల రాబడి మొత్తం రూ.12,71,31,000, సాధారణ నిధులు ఖర్చు మొత్తం రూ.7,25,45,000, మూలధనం నిధులు ఖర్చు మొత్తం రూ.12,66, 70,000, ముగింపు నిల్వ రూ.18,4,16,462 బడ్జెట్‌లో చూపించారు. బడ్జెట్ చర్చ ప్రారంభించిన సమయంలో వైస్ చైర్‌పర్సన్ స్వర్ణమణి కొన్ని అభ్యంతరాలు ఉన్నాయని అన్నారు. ప్రధానంగా ఐదు అంశాలు సవరణ చేయాలని సూచిస్తూ... కమిషనర్ రమేష్‌కు సవరణ పత్రాలు అందించారు. పురలో నూతన భవన నిర్మాణాలు జోరుగా సాగుతున్నా ఆదాయం పెరగలేదన్నారు. రెసిడెన్షియల్ కాంప్లెక్స్ అంటూ కమర్షియల్ నిర్మాణాలు జరుగుతున్నాయని అన్నారు. అశీలు రెట్లు ఎందుకు పెంచలేదని ప్రశ్నించారు. మరో వైస్ చైర్మన్ భారతి దివ్య మాట్లాడుతూ వైస్‌చైర్‌పర్సన్లకు టిఎలు, డిఎలు క్లయిమ్ చేసుకోవడానికి మున్సిపల్ చట్టంలో ఉందని అన్నారు.

చేసిన సేవలే గుర్తింపునిస్తాయి

ప్రజాశక్తి- పలాస

ప్రభుత్వ ఉద్యోగి తన వృత్తి కాలంలో చేసిన సేవలే గుర్తింపు నిస్తాయని ఆర్‌డిఒ భరత్ నాయక్ అన్నారు. పలాస ఆర్‌డిఒ కార్యాలయంలో పనిచేస్తున్న డిప్యూటీ తహశీల్దార్ డి.లక్ష్మీనారాయణ బుధవారం ఉద్యోగ విరమణ పొందారు. ఈ మేరకు లక్ష్మీనారాయన దంపతులకు ఆర్‌డిఒ దుశ్శాలువ కప్పి సన్మానించారు. అనంతరం మాట్లాడుతూ ప్రతి ప్రభుత్వ ఉద్యోగానికీ బదిలీలు, ఉద్యోగ విరమణ సర్వసాధారమన్నారు. ఉద్యోగి ప్రజలకు చేసిన సేవలే తీపి గుర్తులుగా మిగిలిపోతాయన్నారు. లక్ష్మీనారాయణ తన జీవితాన్ని ప్రశాంతంగా గడపాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆర్‌డిఒ కార్యాలయం ఎఒ పి.బాల, పలాస, వజ్రపుకొత్తూరు, మందస మండలాల తహశీల్దార్లు ఎల్.మధుసూదనరావు, అప్పలస్వామి, బి.పాపారావు, పైల వెంకటేశ్వర రావు, వాయిలపల్లి గిరి, రెవెన్యూ అసోసియేషన్ నాయకులు రామారావు పాల్గొన్నారు.

సన్మానిస్తున్న ఆర్‌డిఒ భరత్‌నాయక్

ఉద్యోగ భద్రత కల్పించాలి

కోటబొమ్మాళి: పశుసంవర్ధకశాఖలో విధులు నిర్వహిస్తున్న గోపాల మిత్రలకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ఈ మేరకు స్థానిక టిడిపి కార్యాలయంలో ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడును బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. పశుసంవర్ధకశాఖలో చాలాకాలంగా గోపాల మిత్రలుగా పాడి రైతులకు సేవలు అందిస్తున్నామని అన్నారు. కానీ మా ఉద్యోగానికి భద్రతలేదని ఆవేదన వ్యక్తం చేశారు. టిడిపి మేనిఫెస్టోలో పెట్టాలని కోరారు. దీనికి అచ్చెన్నాయుడు స్పందించి టిడిపి అధినేత చంద్రబాబుతో మాట్లాడి మీకు న్యాయం చేస్తానని హామీనిచ్చారు. కార్యక్రమంలో గోపాలమిత్రలు కర్రి అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

స్పీకర్ సీతారాం పరామర్శ

ప్రజాశక్తి- పొందూరు

మండలం తోలాపిలో ఇటీవల మృతి చెందిన పలువురు కుటుంబసభ్యులను బుధవారం స్పీకర్ తమ్మినేని సీతారాం పరామర్శించారు. గ్రామానికి చెందిన డిఎస్‌పి పాత్రుని రామచంద్రరావు మాతృమూర్తి పాత్రుని నరసమ్మతో పాటు, పార్టీనేతలు మొదలవలస చక్రధర్, గురుగుబెల్లి యువరాజులకు చెందిన కుటుంబసభ్యులు ఇటీవల మృతి చెందడంతో వారి కుటుంబాలను ఆయన పరామర్శించి ఓదార్చారు. ఈయనతో పాటు వైసిపి మండల అధ్యక్షుడు పప్పల రమేష్‌కుమార్, వైసిపి నాయకులు దుంపల శ్యామలరావు, పప్పల రాధాకృష్ణ, పప్పల రామ్మోహన్, దుంపల సీతారాం, జగన్నాథం, గణపతి పరామర్శించారు.

పరామర్శిస్తున్న స్పీకర్ సీతారాం

రణస్థలం : ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

కుష్టు వ్యాధిపై అవగాహన

రణస్థలం: మండలంలో కొండములగాంలో రావాడ పిహెచ్‌సి ఆధ్వర్యంలో మహాత్మా గాంధీ వర్ధంతి పక్షోత్సావాలు సందర్భంగా కుష్టువ్యాధిపై అవగాహన కార్యక్రమం సర్పంచ్ గొర్లె మంజులాదేవి ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ ప్రతినిధి గొర్లె అప్పలనాయుడు మాట్లాడుతూ గ్రామంలో ఎవరికైనా చర్మంపై పొడిబారిన తెలుపు, రాగి ఎరుపు మచ్చలు ఉండి, స్పర్శ తెలిసి తెలియనట్లుగా ఉన్న వెంటనే వైద్య సిబ్బందికి తెలియజేయాలని, పరీక్షలు చేసి గుర్తించిన వెంటనే బహుళ ఔషధ చికిత్స ద్వారా నయం చేసుకోవచ్చని తెలిపారు. ఆరోగ్య పరంగా ఎవరికి ఇబ్బంది వచ్చినా సొంత వైద్యం మానుకుని వైద్యులను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపిటిసి రెడ్డి వాసుదేవ రావు, సెక్రటరీ రవీంద్ర, ఎంఎల్‌హెచ్‌పి డి.రేవతి, హెల్త్ అసిస్టెంట్ రమేష్, ఎఎన్ఎం పి.మణమ్మ, సచివాలయ సిబ్బంది, ఆశా వర్కర్లు సీతారత్నం, మోడల్ స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు.

కవిటి: కుష్టు వ్యాధి నివారణ చర్యల్లో భాగంగా మండలంలోని నెలవంకలో బుధవారం ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఆశా కార్యకర్తలతో, విద్యార్థులతో కలిసి గ్రామంలో కలిగే తిరిగారు. అవగాహనతోనే కుష్టు వ్యాధి నివారణ సాధ్యమని, కుష్టు అనేది అంటూ వ్యాధి కాదని డాక్టర్లు శశిధర్, మౌనిక తెలిపారు. అదే విధంగా శరీరంపై అనుమానాస్పదమైన స్పర్శ లేని మచ్చ ఏర్పడితే కచ్చితంగా స్థానిక ప్రభుత్వాస్పత్రిలో తనిఖీ చేసుకుని వైద్యులను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రతినిధి కుమార్ మోహన్, మాజీ సర్పంచ్ కృష్ణబిసాయి, వైద్య సిబ్బంది అభిమన్యు సోయి, కేశవరావు పాల్గొన్నారు.

సంక్షోభంలో వ్యవసాయరంగం

పలాస : మోడీ పాలనలో వ్యవసాయరంగం తీవ్రంగా సంక్షోభంలో కూరుకుపోయిందని, కేంద్ర పాలన రైతులను కష్టాల కొలిమిలోకి మార్చిందని అఖిల భారత రైతు కూలీ సంఘం (ఎఐకెఎంఎస్) రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వంకల మాధవరావు అన్నారు. మండలంలోని సూదికొండ సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ పార్టీ కార్యాలయంలో పదో మహాసభ పోస్టర్‌ను బుధవారం ఆవిష్కరించారు. అనంతరం పలాస, వజ్రపుకొత్తూరు, మందస మండలాల్లో ప్రచారాలు నిర్వహించారు. ఉమ్మడి గుంటూరు జిల్లా గురజాలలో మహాసభను చేపడుతున్నామని, దీనిని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎఐకెఎంఎస్ జిల్లా ఉపాధ్యక్షులు సవర బంగ్లా కుమార్, అరుణోదయ సాంస్కృతి సమాఖ్య జిల్లా కార్యదర్శి సోమేశ్వరరావు, ఐఎఫ్‌టియు కార్మిక సంఘం నాయకులు పతివాడ షణ్ముఖరావు, బాలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న పి.ఎం.జె బాబు

పలాసలో భూ కబ్జాలు

ప్రజాశక్తి- పలాస

పలాస నియోజకవర్గంలో అధికార పార్టీకి చెందిన నాయకులు భూ కబ్జాలకు పాల్పడుతున్నారని టిడిపి నియోజకవర్గ పరిశీలకులు పి.ఎం.జె.బాబు ఆరోపించారు. కాశీబుగ్గ-పలాస ప్రాంతాల్లో టిడిపి నాయకులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలకు పథకాలను అందిస్తున్నామని చెబుతూ ప్రభుత్వ ఆస్తులను తాకట్టు పెడుతున్నారని ఆరోపించారు. రానున్న ఎన్నికల్లో టిడిపి గెలుపు తథ్యమన్నారు. అందుకు ప్రతి కార్యకర్త సైనికుల్లా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు, బిసి సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లొడగల కామేశ్వరరావు, గురిటి సూర్యనారాయణ, గాలి కృష్ణారావు, టంకాల రవి శంకర్‌గుప్తా, సవర రాంబాబు, బడ్డ నాగరాజు, సప్ప నవీన్, యవ్వారి మోహనరావు, అంబటి కృష్ణమూర్తి పాల్గొన్నారు.

ఉపాధి కూలీల సంఖ్య పెంచాలి

ప్రజాశక్తి - వీరఘట్టం

గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనుల్లో భాగంగా వేతనదారుల సంఖ్య పెంచాలని ఎపిఒ జి.సత్యంనాయుడు క్షేత్ర సహాయకులకు ఆదేశించారు. బుధవారం స్థానిక కార్యాలయంలో క్షేత్ర సహాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఎవరికైనా జాబ్ కార్డు లేకపోతే తక్షణ జాబు కార్డులను మంజూరు చేయాలని, ప్రతి ఒక్కరికీ పని కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో టెక్నికల్ క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు ఎస్‌పి సత్కారం

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

అంకితభావంతో పోలీసుశాఖకు అందించిన సేవలు ఎప్పటికీ గుర్తుంచుకుంటుందని ఎస్పీ విక్రాంత్ పాటిల్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలోని పదవీ విరమణ పొందిన సిహెచ్.వెంకటరావు (సీనియర్ అసిస్టెంట్ (డిపిఒ), ఎస్.శంకర్ రావు (అసిస్టెంట్ సబ్ ఇన్స్పెక్టర్ గరుగుబిల్లి)ను సన్మానించారు. కార్యక్రమంలో ఎస్పీ ఒ.దిలీప్ కిరణ్, ఏఆర్ డిఎస్పీ శేషాద్రి, సిఐ సిహెచ్.లక్ష్మణరావు, పలువురు ఉద్యోగులు పాల్గొన్నారు.

3న ఆసరా పంపిణీ

వీరఘట్టం : స్థానిక మహిళా సమైక్య కార్యాలయ ఆవరణలో ఈనెల 3న నాలుగో విడత వైయస్సార్ ఆసరా కానుక పంపిణీ చేయనున్నట్లు ఎపిఎం బి.శివున్నాయుడు బుధవారం ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే వి.కళావతి, ఎమ్మెల్సీ పి.విక్రాంత్ ఆధ్వర్యంలో పంపిణీ చేయనున్నారని ఎస్‌హెచ్‌జి గ్రూపు సభ్యులు తప్పనిసరిగా హాజరుకావాలని ఆయన కోరారు.

బిసిలకు రాజ్యాధికారమే లక్ష్యం

మాట్లాడుతున్న శంకరరావు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

బిసిలకు రాజ్యాధికారమే లక్ష్యంగా ఐక్యంగా ఉద్యమించాలని ఎపి బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేశన శంకరరావు పిలుపునిచ్చారు. నగరంలో బిసి సంక్షేమ సంఘం కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా పదేళ్లగా బిసిల ఐక్యత, అభ్యున్నతి లక్ష్యంగా సంఘం పనిచేస్తుందని, బిసిల చైతన్యమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామన్నారు. బిసిలను అన్ని రాజకీయ పార్టీలు ఓటు బ్యాంకుగానే చూస్తున్నాయన్నారు. జనాభాలో 80శాతం ఉన్న ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీలకు రాజ్యాధికారాన్ని రాజకీయ పార్టీలు దూరం చేస్తున్నాయన్నారు. సామాజికంగా, రాజకీయంగా, ఆర్థికంగా అణగదొక్కుతున్నారన్నారు. కులగణన చేయకపోవడం వలనే బిసిలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని, యుద్ధ ప్రాతిపదికన కులగణన పూర్తి చేసి దామాసా పద్ధతిలో పదవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సంఘం జనరల్ సెక్రటరీగా తోనంగి వెంకన్న యాదవ్, ఉపాధ్యక్షునిగా మైలపల్లి నరసింహమూర్తిలను నియమిస్తూ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఉత్తరాంధ్ర గౌరవ అధ్యక్షులు కొమ్ము రమణమూర్తి, జిల్లా అధ్యక్షులు పైడి చంద్రరావు చందు, సెక్రెటరీ ఇప్పిలి మధుసూదనరావు, డి సారథి, పాపారావు, దిలీప్ తాండ్ర, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మత్స్యకారులకు సముచిత స్థానం

మాట్లాడుతున్న సూర్యనారాయణ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

రాష్ట్రంలో, జిల్లాలో రెండో అతిపెద్ద సామాజికవర్గమైన మత్స్యకారులకు రాజ్యాధికారంలో సముచిత ప్రాధాన్యత కల్పించే దిశగా రాజకీయ పార్టీలు ఆలోచన చేయాలని మత్స్యకార ఎస్‌టి సాధనసమితి అధ్యక్షులు చింతపల్లి సూర్యనారాయణ డిమాండ్ చేశారు. నగరంలో కిమ్స్ ఆస్పత్రి రోడ్డులో ఓ భవనంలో మంగళవారం మత్స్యకార సాధన సమితి ఆధ్వర్యాన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సూర్యనారాయణ మాట్లాడుతూ తమకు చట్టసభల్లో ప్రాతినిధ్యం కల్పించాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా 40 లక్షల మంది మత్స్యకారులు ఉన్నారని, రిజర్వేషన్ల ప్రకారం 12 ఎమ్మెల్యే సీట్లు కేటాయించాలని, రెండు మంత్రి పదవులు, ఒక ఎమ్మెల్సీ, రెండు జిల్లాపరిషత్ చైర్మన్ల పదవులు కేటాయించాలని కోరారు. ఉపాధ్యక్షులు మైలపల్లి నర్సింహ మూర్తి మాట్లాడుతూ గత పాలకులు తమ సామాజికవర్గాన్ని మోసగించి అధికారంలోకి వచ్చారన్నారు. ఎస్‌టి జాబితాలో తమ సామాజికవర్గాన్ని చేరుస్తామని మాట ఇచ్చి తప్పారన్నారు. టిడిపి హయాంలో తమ సామాజిక వర్గానికి చెందిన దూడ భవానీ శంకర్‌కు మున్సిపల్ చైర్మన్ అవకాశం కల్పించారన్నారు. 2024 ఎన్నికల్లో తమ సామాజికవర్గానికి రాజ్యాధికారాన్ని సాధించే దిశగా న్యాయం చేయకపోతే రానున్న ఎన్నికల్లో ప్రచారం కోసం వచ్చే నాయకుల్ని తమ గ్రామాల్లో తిరగనివ్వబోమని హెచ్చరించారు. సమావేశంలో మత్స్యకార ఎస్‌టి సాధన సమితి కో-కన్వీనర్ పోలీసు, ఇద్ది పాపయ్య మాస్టారు, గణేష్ కుమార్, కొండా సింహాచలం, కొమర మురళీ, గణగళ్ల మూర్తి పాల్గొన్నారు.

అధ్వానంగా మురుగు కాలువలు

మురుగు కాలువలో పేరుకుపోయిన వ్యర్థాలు

ప్రజాశక్తి- ఆమదాలవలస

పురపాలక సంఘ పరిధి 15వ వార్డు కొత్తకోటవారి వీధిలో మురుగు కాలువలు పాడై అధ్వానంగా తయారైనప్పటికీ పట్టించుకునే నాథుడే లేరని అధికారులు, ప్రభుత్వ తీరుపై ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. గత కొంతకాలంగా వెంకటేశ్వర కళ్యాణ మండపం వద్ద చెత్తకుండీని ఏర్పాటు చేయాలని పలుమార్లు నాయకులు, అధికారులకు మొరపెట్టుకున్నప్పటికీ నేటికీ కార్యరూపం దాల్చలేదని చెబుతున్నారు. పారిశుద్ధ్య కార్మికులు సమ్మె విరమించినప్పటి నుంచి నేటివరకు చెత్తను సేకరించడానికి సిబ్బంది రావడంలేదని వాపోతున్నారు. సిబ్బంది చెత్త సేకరణకు రాకపోవడంతో ప్రజలు కాలువల్లో చెత్తను పారవేయడంతో మురుగునీరు ఎక్కడికక్కడే నిలిచి దోమల బెడద విపరీతంగా పెరిగి రోగాల బారిన పడుతున్నామని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి సిబ్బంది చెత్తను సేకరించేలా ఏర్పాట్లు చేసి మురుగు కాలువలను శుభ్రం చేయాలని ప్రజలు కోరుతున్నారు.

బెంతు ఒరియాలను గుర్తించాలి

దీక్షలో పాల్గొన్న పద్ద గ్రామస్తులు

ప్రజాశక్తి- కవిటి

దశాబ్దాలుగా గుర్తింపులేని తరగతి బెంతు ఒరియాలు మిగిలారని మెలియాపుట్టి మండలం పద్దకు చెందిన బెంతు ఒరియా ప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేశారు. 35 రోజులుగా కవిటిలో రిలే నిరాహారదీక్షలు చేస్తున్న సహచర మిత్రులకు బుధవారం వారు సంఘీభావం ప్రకటించారు. అనంతరం పద్ద సర్పంచ్ రామచంద్ర మజ్జి మాట్లాడుతూ దశాబ్దాలుగా పరిష్కారం కాని బెంతు ఒరియాల సమస్యను రాజకీయ పార్టీల అలసత్వమే ప్రధాన కారణమని ఆరోపించారు. ముఖ్యంగా తరగతి ధ్రువీకరణ పత్రాలు లేకపోవడంతో విద్యార్థులు, నిరుద్యోగులు బంగారం లాంటి భవిష్యత్ కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు స్పందించి తమకు తరగతి ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయాలని కోరారు. లేదంటే తమ సమస్య పరిష్కారమయ్యేవరకు పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో భగవతి మజ్జి, బిరోసేన్ బిసాయి, తరణి మజ్జి, సంతోష్ మజ్జి, కాకర్ల కామేష్, శివ, పద్మనాభం మజ్జి పాల్గొన్నారు.

ఉమ్మడి అభ్యర్థి గెలుపునకు ఐక్యంగా కృషి

కురుపాం: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో టిడిపి - జనసేన ఉమ్మడి అభ్యర్థి గెలుపునకు అంతా కలిసికట్టుగా పనిచేద్దామని టిడిపి రాష్ట్ర కార్యదర్శి వైరిచర్ల వీరేశ్‌చంద్రదేవ్ అన్నారు. బుధవారం కురుపాంలో గల ఆయన కోట వద్ద జనసేన నియోజకవర్గ ఇన్చార్జి కడ్రక మల్లేష్, ఐదు మండలాల జనసేన కన్వీనర్లు, నాయకులతో ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి, జనసేన నాయకులు, కార్యకర్తలు అంతా కలిసికట్టుగా పనిచేస్తూ అధిష్టానం నిర్ణయానికి కట్టుబడి ఉమ్మడి అభ్యర్థి గెలుపే లక్ష్యంగా పనిచేయడానికి సైనికుల ఉండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టిడిపి మాజీ ఎంపి వైరిచర్ల ప్రదీప్ చంద్రదేవ్, టిడిపి మండల కన్వీనర్ కెవి కొండయ్య, టిడిపి నాయకులు, జనసేన నియోజకవర్గ నాయకులు ఎన్.వంశీ, జి.గౌరి, ఐదు మండలాల జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టిడిపితోనే అభివృద్ధి

ఇచ్ఛాపురం : టిడిపితోనే అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే బెందాళం అశోక్ అన్నారు. పట్టణంలోని ఆరో వార్డులో ఎంపీ నిధులు రూ.5 లక్షలతో కమ్యూనిటీ భవన నిర్మాణానికి బుధవారం శంకుస్థాపన చేశారు. అనంతరం ఎమ్మెల్యేకు దుశ్శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు సాలిన ఢిల్లీ, నందిక జాని, ఆసీ చిరంజీవులురెడ్డి, దక్కత ఢిల్లీరావు, సహదేవ్‌రెడ్డి, కొండ శంకర్‌రెడ్డి, కాళ్ల జయదేవ్, ఆసీ లీలారాణి, ధర్మారావు పాల్గొన్నారు.

గ్రామాల్లో పల్లె పల్లెకు టిడిపి

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

టిడిపితోనే రాష్ట్రాభివృద్ధి అని టిడిపి మండల పార్టీ అధ్యక్షులు సూరాడ మోహనరావు అన్నారు. మండలంలోని గరుడభద్ర, రాజాం, కొత్తపేట గ్రామాల్లోని బుధవారం పల్లెపల్లెకు టిడిపి కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ మాట్లాడుతూ మరో రెండు నెలల్లో వైసిపి ఇంటికి వెళ్లిపోవడం ఖాయమని అన్నారు. చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు సంబమూర్తి, బాలకృష్ణ, శశిభూషణ్, దుర్యోధన పాల్గొన్నారు.

సన్మానిస్తున్న అసోసియేషన్ సభ్యులు

ఎంఇఒకు సన్మానం

ఇచ్ఛాపురం : ఎంఇఒ కె.అప్పారావు ఇటీవల నిర్వహించిన రిపబ్లిక్ డేలో అవార్డును అందుకున్నారు. ఈ మేరకు ఎపి ప్రయివేటు స్కూల్ అసోసియేషన్ సభ్యులు బుధవారం దుశ్శాలువ కప్పి సన్మానించారు. వరుసగా రెండో సారి అవార్డు అందుకోవడంపై ఆనందంగా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎపి ప్రయివేటు స్కూల్ అసోసియేషన్ నియోజకవర్గ అధ్యక్షులు అధ్యక్షుడు చాట్ల తులసీదాస్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి డి.కృష్ణమూర్తిరెడ్డి, మండల అధ్యక్షులు పల్లంటి చిరంజీవి, కార్యదర్శి మార్కండేయులు, కోశాధికారి ఢిల్లేశ్వరరావు, కృష్ణారావు పాల్గొన్నారు

బీమాను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి- పర్లాకిమిడి

ఒడిశా ప్రభుత్వం ఉచిత బీమా పథకాన్ని ప్రవేశపెట్టిందని, దీనిని శ్రామికులందరూ సద్వినియోగం చేసుకోవాలని జిల్లా సహాయ శ్రామిక అధికారి అనిల్‌కుమార్ బిసోయి అన్నారు. గజపతి జిల్లా కాశీనగర్ బిజు కళ్యాణ మండపంలో ఒడిశా శ్రామిక కళ్యాణ యోజనా కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రమాదంలో మృతి చెందిన కుటుంబాలకు రూ.4 లక్షలు, సాధారణంగా మృతి చెందితే రూ.2 లక్షలు వర్తిస్తాయని అన్నారు. ప్రమాదం వల్ల పూర్తి అంగవైకల్యం పొందిన వారికి రూ.1.50 లక్షలు వర్తిస్తాయని అన్నారు. ప్రతిఒక్కరూ తమ పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు. ఏటా తప్పనిసరిగా రెన్యూవల్ చేయించుకోవాలన్నారు. జనసేవ కేంద్రాల్లో ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసుకోవాలని సూచించారు.

మాట్లాడుతున్న అనిల్‌కుమార్